క్లుప్తంగా

వీల్‌చైర్ అందజేత



నెహ్రూనగర్: ఆర్ అగ్రహారం కోనేరు ప్రాంతానికి చెందిన దివ్యాంగురాలు నాగేంద్రమ్మ, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర వీల్‌చైర్ సోమవారం అందజేశారు. నడవలేని పరిస్థితుల్లో, మూడు చక్రాల సైకిల్ లేక, చిన్న చిన్న పనులు చేసుకోవడానికి వేరే వారిపై ఆధారపడుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం ఆయన దృష్టికి రావడంతో స్పందించారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి పిలిపించి మూడు చక్రాల సైకిల్‌ను అందించారు.

యువతి అదృశ్యం

లక్ష్మీపురం: బాలిక అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, ఉప్పలపాడు గ్రామానికి చెందిన మల్లెల కృష్ణా కుమార్తె గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతోంది. ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటోంది. అయితే ఈనెల 6వ తేదీన హాస్టల్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయం తెలుసుకున్న వనిత కుటుంబ సభ్యులు గుంటూరు, పల్నాడు ప్రాంతాలలో వెతుకలాడిన ఎంతకు ఆచూకి తెలియకపోవడంతో వనిత తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకి తెలిసిన వారు అరండల్‌పేట సీఐ ఆరోగ్య రాజు 8688831332, అరండల్‌పేట పోలీస్ స్టేషన్ 0863-2231955 లకు సమాచారం అందించాల్సిందిగా కోరారు.

నేటి నుంచి పాఠశాలల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు

పొన్నూరు: పట్టణంలోని పలు పాఠశాలల్లో మంగళవారం నుంచి ఈ నెల 30 వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19,20వ తేదీన 25 వార్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, 19,21న 9వ వార్డు రైలు పేట ఆదికుమార్ మున్సిపల్ స్కూల్, 19,23న ఒకటో వార్డు భావనగర్ కాలనీ సాయి ఆదర్శ హైస్కూల్, 21,23న 25 వార్డు ఇటికంపాడు రోడ్డు శ్రీ రామ మున్సిపల్ హైస్కూల్, 22,23న 8వ వార్డు నిడుబ్రోలు ఏపి స్కూల్, 28,30న 26వ వార్డు పాత పొన్నూరు శ్రీ రామ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్, 7 వార్డు డీవీసీ కాలనీ మున్సిపల్ స్కూల్, ఒకటో వార్డు భావనగర్‌కాలనీ శ్రీ వేద హైస్కూల్‌లో శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ముగిసిన కొలుపుల మహోత్సవం

గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు గ్రామంలో వేంచేసియున్న ఆళ్ళ వారి శ్రీ తినం కమ్మతల్లి కొలుపుల మహోత్సవం సోమవారంతో ముగిసింది. కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ఉద యం ప్రత్యేక పూజలు, హోమాలు, వ్రతాలను నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి మహా పొంగలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్దెత్తున పాల్గొని అమ్మవారికి పొగళ్ళను సమర్పించారు. సాయంత్రం అమ్మవారి తీర్థ ప్రసాదం అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో వేలా దిగా భక్తులు అమ్మవారి తీర్థప్రసాదం స్వీకరించా రు. కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు

పెదకాకాని(ఏఎన్‌యూ): విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తాత్కాలిక విసి ఆచార్య గంగాధర్‌రావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బాలుర వసతి గృహాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వాషింగ్ మెషీన్లను సోమ వా రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వసతి గృహ విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వాషింగ్ మెషీన్లు అందుబాటులోకి రావడం ద్వారా విద్యార్థుల సమయం కూడా ఆదా అవుతుందని చెప్పారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య రత్నా శిలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం లు మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రతి సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యా ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. హైయ ర్ గ్రూప్ కార్పొరేషన్ సారథ్యంలో 35 వాషింగ్ మిషన్లు ఏర్పాటు చేశారన్నారు. పే అండ్ యూజ్ పద్ధతిలో విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. హైయర్ కంపెనీ న్యూఢిల్లీ మేనేజర్ హర్ష, ఏపీ, తెలంగాణ సౌత్ మేనేజర్ ఎస్ మనోజ్ కుమార్, మొబైల్ యాప్ ద్వారా విద్యార్థులు , కొంత నగదును పే చేసి, వాషింగ్ మిషన్ ఆపరేట్ చేసే వెసులుబాటు ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య మల్లికార్జున, ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ కుమార్, ఆచార్య వీరయ్య, ఆచార్య లింగరాజు, ఆచార్య ప్రమీలరాణి, డిప్యూటీ ఇంజనీర్ ఎన్.వెంకటేశ్వర్లు, అదనపు ఇంజనీర్లు సతీష్ ధనుంజయ్ పాల్గొన్నారు.

సిండి'కేటు'గా గండి !

- కొల్లి శారద హోల్‌సేల్ మార్కెట్‌లో షాపుల వేలానికి అడ్డంకులు
- కార్పొరేషన్ ఆదాయం గండి కొట్టాలని లీజుదారుల ఎత్తుగడ
- సోమవారం జరిగిన వేలం పాటకు దూరం
- బైపాస్‌లో మార్కెట్ ఏర్పాటుకు శంకుస్థాపన



కొల్లి శారదా హోల్‌సేల్ కూరగాయల మార్కెట్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆదాయానికి గండి కొట్టేందుకు కొల్లి శారదా మార్కెట్ లీజుదారులు సిండికేట్ అయ్యారు. లీజు గడువు గత ఏడాది మేతో 25 సంవత్సరాలు పూర్తయినా షాపులను విడిచి పెట్టడం లేదు. అప్పటి నుంచి హైకోర్టును ఆశ్రయించి, సంవత్సరన్నరకు పైగా షాపుల్లో దర్జాగా పాగా వేశారు. ఎలాగైనా తమకే రెన్యువల్ చేయాలని ఎమ్మెల్యేలు, మంత్రి, ఎంపీల ద్వారా నగరపాలక సంస్థ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. మంత్రి సూచనతో ఈ నెల 12, 13, 14వ తేదీల్లో జరగాల్సిన వేలం పాటను గవర్నర్ పర్యటనను సాకుగా చూపి నిలిపివేశారు. దీనిపై సాక్షి దిన పత్రికలో 'గ'లీజు'లో కూటమి కుయుక్తులు అనే కథనం ఈ నెల 11న ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. నిబంధనల మేరకే 81 షాపులకు వేలం పాట నిర్వహించాలని ఆయన సూచించడంతో 18, 19, 20వ తేదీల్లో షాపులకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు.

రెండు వర్గాలుగా చీలిన అసోసియేషన్

ప్రస్తుతం మార్కెట్‌లో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా అసోసియేషన్ నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయారు. ఇందులో మెజార్టీ వర్గం నేతలు వేలం పాటకు దూరంగా ఉండాలని హుకుం జారీ చేశారు. దీంతో సోమవారం జరిగిన పాటకు పాత లీజుదారులు హాజరైనప్పటికీ, వేలం పాటలో పాల్గొనలేదని సమాచారం.

వేలం పాటలో కూటమి కార్పొరేటర్ల హవా

ఒక పక్క పాత లీజుదారులంతా మార్కెట్‌ను గుంటూరు నగరం నుంచి ఏటుకూరుకు తరలించే ప్రయత్నాలు చేస్తుంటే.. మరో పక్క ఇక్కడ షాపులను ఎలాగైనా దక్కించుకునేందుకు కూటమికి చెందిన కార్పొరేటర్లంతా వేలంపాట జరిగే కాన్ఫరెన్స్ హాల్‌లో పాగా వేశారు. బినామీలను పెట్టుకుని షాపులను దక్కించుకునేందుకు పావులు కదిపారు. బయట వ్యక్తులు ఎవరైనా వేలం పాటలో పాల్గొంటున్నారని తెలిస్తే వారి వద్దకు వెళ్లి బేరసారాలు జరుపుకుని, రాకుండా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బైపాస్‌కు తరలించేందుకు యత్నాలు

షాపుల లీజుదారులంతా సిండికేట్‌గా తయారై కొత్త ఎత్తుగడ వేశారు. వేలం పాటకు దూరంగా ఉండటంతో పాటు కరోనా సమయంలో ఏటుకూరు, బుడంపాడు బైపాస్ మధ్యలో ఏర్పాటు చేసిన స్థలానికి మార్కెట్ తరలించేందుకు అసోసియేషన్ పెద్దలు చర్చలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా సదరు స్థల యజమానికి ఏడాదికి లీజు కింద రూ.85.50లక్షలు చెల్లించి, అక్కడికి వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ మొత్తాన్ని ముందుగానే అడ్వాన్స్ కింద చెల్లించాలని స్థల యజమాని చెప్పడంతో అసోసియేషన్ పెద్దలు లీజుదారుల వద్దకు వెళ్లి, ఒక్కో షాపునకు రూ.50వేల నుంచి రూ.లక్ష దాకా వసూలు చేస్తున్నట్లు సమాచారం. పైగా సోమవారం ఏటుకూరు, బుడంపాడు బైపాస్ వద్ద ఉన్న స్థలంలో మార్కెట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.

మహిళలను మోసం చేసిన చంద్రబాబు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, వెస్ట్ సమన్వయకర్త అంబటి రాంబాబు

పట్నంబజారు: విషపూరిత మనస్తత్వం కలిగి, నమ్మిన ప్రజలపై విషం చిమ్మే వ్యక్తి చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు విమర్శించారు. నియోజకవర్గంలోని 33వ డివిజన్ అశోక్‌నగర్‌లో డివిజన్ కార్పొరేటర్ గోపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ దగా అనే పదానికి నిలువెత్తు రూపం చంద్రబాబు అని మండి పడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, సిగ్గు లేకుండా సూపర్-6 సూపర్ హిట్ అని చెప్పుకుంటున్నారని విమర్శించారు. సూపర్-6 సూపర్ ఫట్ అని, ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. పార్టీ గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.1500 పథకాన్ని అమలు చేయకుండా ఉచిత బస్సు ఇచ్చామని డప్పుకొట్టుకోవడం సిగ్గుచేటన్నారు. మహిళలు ఉచిత ప్రయాణం కోరుకోవడం లేదని, నెలకు రూ.1500 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడికైనా తిరిగవచ్చని చెప్పిన చంద్రబాబు నాన్ స్టాప్, లగ్జరీ బస్సుల్లో అవకాశం కల్పించకుండా ఎక్కడిక్కడ బస్సు దిగి ఎక్కే కార్యక్రమం మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. కూటమి సర్కార్ మూల్యం చెల్లించుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయని చెప్పారు. పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ కూటమిలో మహిళలకే రక్షణ లేకుండా పోయిందని చెప్పారు. సాక్షాత్తు టీడీపీకి చెందిన కార్యకర్తే స్వయంగా ఆరోపణలు చేస్తుంటే చంద్రబాబు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మహిళలకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్న పవన్ కళ్యాణ్ ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. టీడీపీ నేతల దుర్మార్గాలపై ఎంతటి పోరాటాలకు వెనుకాడమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈచంటిపాటి వెంకటకృష్ణ, పార్టీ నేతలు వంగల వలివీరారెడ్డి, పఠాన్ సైదా ఖాన్, జగన్ కోటి, వసంత్, పరస బుజ్జి, షేక్ రజియాబేగం, చల్లా శేషురెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అంబటి రాంబాబు, మోదుగుల, నూరిఫాతిమా, తదితరులు

21న దేశవ్యాప్తంగా అంగన్‌వాడీల నిరసన



మాట్లాడుతున్న వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కుమారి

లక్ష్మీపురం: ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) పిలుపు మేరకు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారానికి ఈనెల 21న దేశవ్యాప్త నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి పిలుపునిచ్చారు. పాత గుంటూరు సీఐటీయూ ఆఫీసులో సోమవారం అంగన్‌వాడీ యూనియన్ జిల్లా సమావేశం జి.రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లో నుంచి జీతాలు పెంచాలని, తల్లికి వందనం, వితంతు పెన్షన్, ఎస్టీ, ఎస్సీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇతర సంక్షేమ పథకాలాన్ని అమలు చేయాలని అన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి జీఓ ఇవ్వాలని, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అక్రమంగా సస్పెన్షన్‌కు గురైన లాం గ్రామం అంగన్‌వాడీ వర్కర్ టి.సామ్రాజ్యంను విధుల్లోకి తీసుకుని, జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. కోరికల సాధన కోసం అన్ని మండల కేంద్రాల్లో అంగన్‌వాడీలు నల్ల చీరలతో మానవహారాలు నిర్మించి, తహసీల్దార్‌కి వినతిపత్రం ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీ నారాయణ, యూనియన్ జిల్లా నాయకులు రత్న మంజుల, చిన్న వెంకాయమ్మ పాల్గొన్నారు.

'పాడనా తెలుగు పాట'కు ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు చలన చిత్ర అపూర్వ గీతాలను వెలికితీయడంతో పాటు వాటిని యువతకు చేరవేసే లక్ష్యంగా ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహించనున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా 'పాడనా తెలుగు పాట' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఘంటసాల- ఎస్పీ బాలు వేదికపై తెలుగు పాటకు నీరాజనంగా ప్రతిభావంతులైన గాయనీ, గాయకులకు గానం చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మంచి సాహిత్యం కలిగిన రెండు తెలుగు చలన చిత్ర గీతాలను కరోకే ద్వారా ఫోన్‌లో ఆడియో రూపంలో రికార్డు చేసి సెప్టెంబర్ 10వ తేదీలోపు ఈ-మెయిల్ ద్వారా పంపాలని సూచించారు. అర్హత పొందిన గాయకులను ఎంపిక చేసి, ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై గానం చేసేందుకు అధికారిక ఆహ్వానం పంపబడుతుందని, పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రంతో పాటు తెలుగు మహాసభల పతకాన్ని అందజేస్తామన్నారు. ఎంట్రీలను amma pandu2026@gmail.com మెయిల్‌కు పూర్తి వివరాలతో పాటు, ఫొటో, రెండు కరోకే పాటల ఆడియోలను పంపాలని తెలిపారు. తెలుగు చలన చిత్ర అపూర్వ గీతాల సౌందర్యాన్ని ఆవిష్కరించేందుకు, ప్రతిభావంతులైన గాయకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరిషత్తు కార్యదర్శి రెడ్డప్ప ధవేజి, మహాసభల సమన్వయకర్త పి.రామచంద్ర రాజు కోరారు.

శివారులో మౌలిక వసతుల కల్పన

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గోరంట్ల, ఇన్నర్ రింగ్ రోడ్, రవీంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, మౌలిక వసతుల కల్పన, త్రాగునీటి సరఫరా, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాల్లో డ్రెయిన్లు, రోడ్లు, తాగునీటి కుళాయి కనెక్షన్ల వంటి మౌలిక వసతుల కల్పనకు ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. నూతనంగా నిర్మాణం చేసే డ్రైన్లు తప్పనిసరిగా లెవల్స్ ఉండేలా, నాణ్యత పాటించేలా పర్యవేక్షణ చేయాలని, తమ పరిశీలనలో లోపాలు గుర్తిస్తే సంబంధిత అధికారులు, కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం కృష్ణా నదికి వరద నీరు వస్తున్నందున నగరంలో ప్రజలు త్రాగునీటిని కాచి చల్లార్చి వాడుకోవాలని తెలియచేస్తూ, ప్రతి సచివాలయం పరిధిలో శ్యాం పిల్స్ తీయాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. గోరంట్ల, ఇన్నర్ రింగ్ రోడ్ చుట్టుపక్కల నివాసాలు పెరుగుతున్నందున ఆయా ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి నివాసితులకు దోమలు, పురుగులతో ఇబ్బందులు పడుతున్నామని తమ దృష్టికి తెస్తున్నారని పర్యటనలో డీఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆ పార్టీతో మీ స్నేహం ఎంతకాలం!

- రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అంతంత మాత్రమే సాయం
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

లక్ష్మీపురం: మహాత్మాగాంధీని దోషిగా చూపి... జవహర్‌లాల్ నెహ్రూను ద్రోహిగా చెప్పి... గాంధీని చంపిన గాడ్సేకు గుడులు కట్టించే పార్టీతో మీ స్నేహం ఎంతకాలం కొనసాగిస్తారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొత్తపేటలోని సీపీఐ మల్లయ్యలింగంభవన్‌లో నిర్వహిస్తున్న గుంటూరు జిల్లా 26వ మహాసభలలో భాగంగా రెండో రోజు సోమవారం ప్రతినిధుల సభ నిర్వహించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ మీ మద్దతుతో ఢిల్లీలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఈ 15 మాసాల కాలంలో రాష్ట్రానికి ఏమి చేసిందన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలలో ఏ అంశాలకు మద్దతు నిచ్చిందని చెప్పాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధికి... దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక స్థాయిలో ఏపీని నిలబెట్టడానికి ఏ అంశంలో వారు ఇతోధిక ఆర్థిక తోడ్పాటు అందించారనే విషయాన్ని ఓసారి ఆలోచన చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. గుంటూరు జిల్లాలో వందలాది స్పిన్నింగ్ మిల్లులు ఉన్నాయని, నేడు ఆ స్పిన్నింగ్ మిల్లులు ఆర్థిక నష్టాలతో కునారిల్లుతున్నాయని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా, అమరావతి రైతుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ పోరాటాలకు పునరంకితం అవుతామన్నారు. గుంటూరు జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. సభలో పార్టీ జిల్లా నాయకులు చిన్ని తిరుపతయ్య, ఆకిటి అరుణ్ కుమార్, రెంటాల కుమార్, యశ్వంత్ నాయకులు, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, చల్లా చిన ఆంజనేయులు, బందెల నాసర్, కాబోతు ఈశ్వరరావు, పచ్చల శివాజీ, ఆదేశ్వరరావు, సింగారావు, పుప్పాల సత్యనారాయణ, శశి, ముప్పాళ్ల శివశంకర్ పాల్గొన్నారు.

దుగ్గిరాల ఎస్టీవోపై చర్యలు తీసుకోవాలి

జిల్లా ఖజానాధికారికి ఫిర్యాదు చేసిన యూటీఎఫ్ బృందం



డీటీఓ చంద్రశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధుల బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన వేతనాల బిల్లులను పెండింగ్‌లో ఉంచి వేధింపులకు గురి చేస్తున్న దుగ్గిరాల ఉప ఖజానాధికారి(ఎస్టీఓ)పై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఖజనాధికారి కార్యాలయంలో డీటీఓ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసిన యూటీఎఫ్ ప్రతినిధులు బృందం దుగ్గిరాల ఎస్టీఓపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఎస్టీఓ అశ్విని ప్రతి నెలా వేతన బిల్లులను మంజూరు చేయకుండా కొర్రీలు వేసి తిప్పి పంపుతున్నారని ఆరోపించారు. అవసరం లేని జీఓలను డిమాండ్ చేస్తున్నారని, దీని అర్థం ఏమిటో చెప్పాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా, దుగ్గిరాల ఎస్టీఓ పరిధిలోని దుగ్గిరాల, కొల్లిపర మండల ఉపాధ్యాయుల బిల్లులను పాస్ చేయకుండా నిలిపివేయడం వేధింపులుగా పరిగణించాల్సి వస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తాను మంత్రి తాలూకా అని, నన్నేమీ చేయలేరని ఉద్యోగ, ఉపాధ్యాయులపై బెదిరింపులకు దిగుతున్నారని డీటీఓ దృష్టికి తెచ్చారు. పదేళ్ల క్రితం హెచ్‌ఆర్‌ఏ మారి వేతనాలు పొందుతున్న గ్రామాల్లోని పాఠశాలల్లో ఖాళీలను కోరుకుని వచ్చిన ఉపాధ్యాయులను సంబంధిత జీవోలు తెచ్చి ఇవ్వాలంటూ వేతనాలు చెల్లించకుండా తిప్పించుకుంటున్నారని తెలిపారు. తక్షణమే జిల్లా అధికారులు జోక్యం చేసుకుని వేతనాల చెల్లింపునకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డీటీఓను కలిసిన వారిలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎం.గోవిందు, జి.వెంకటేశ్వరరావు, ఏ.శ్రీనివాసరావు, బి.ప్రసాదు, ఎం.కోటిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రెహమాన్, చంద్రశేఖర్, శివపూర్ణయ్య, ధనరాజు, భాస్కర్ ఉన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు జిల్లా ఐక్య వేదిక చైర్మన్ చాంద్‌బాషా



గుంటూరు వెస్ట్: ఎంతోకాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షనర్లు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని గుంటూరు జిల్లా ఐక్యవేదిక చైర్మన్ సయ్యద్ చాంద్‌బాషా ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఉద్యోగులతో మాట్లాడారు. బుధవారం నిర్వహించనున్న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో విస్తృత చర్చలు ఉంటాయని చెప్పారు. ఉద్యోగుల సమస్యలపై కేబినెట్ సభ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులతో పాటు, విశ్రాంత ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలన్నారు. 12వ వేతన సవరణ కమిటీని సిట్టింగ్ జడ్జితో ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు వెంటనే ఐఆర్ 29 శాతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్టాఫ్ కౌన్సిలింగ్ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే పీజీఆర్‌ఎస్

మేయర్ రవీంద్ర



మేయర్, కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్‌ఎస్‌లో ప్రజలు ఇస్తున్న అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 16 ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని మాట్లాడుతూ అర్జీలను సమగ్రంగా పరిష్కరించాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. సోమవారం పీజీఆర్‌ఎస్‌కు 33 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 10, ఇంజినీరింగ్ విభాగానికి 14, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 2, ఉపా సెల్ విభాగానికి 3 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. ఈకార్యక్రమంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందరామిరెడ్డి, ఇన్‌చార్జి ఎంహెచ్ఓ రామారావు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు..

నెహ్రూనగర్: వీధి కుక్కల నియంత్రణకు ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో అమలు చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచ్ సభ్యులు కోరారు. సోమవారం కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర నాని, కమిషనర్ పులి శ్రీనివాసులును కలిసి వీధి కుక్కల సమస్యల పరిష్కారానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారాయుడు యార్లగడ్డ, డాక్టర్ రామ్ తారకనాథ్, డాక్టర్ సతీష్ కుమార్, బి.సుబ్బయ్య, కె.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

నార్ల ఆడిటోరియం, పరిసర ప్రాంతాల్లో సమగ్ర సర్వే చేసి, ఆక్రమణలు ఉంటే తొలగించుకోవడానికి నోటీసులు ఇవ్వాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. బృందావన్ గార్డెన్స్ లోని నార్ల ఆడిటోరియాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడిటోరియం ప్రాంగణానికి చెందిన స్థలాన్ని సమగ్రంగా సర్వే చేసి, ఆక్రమణలకు గురైనట్లు నిర్ధారణ జరిగితే నోటీసులు ఇవ్వాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. ఈ పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందరామిరెడ్డి, డీఈఈ రమేష్ బాబు, ఏఈ చైతన్య పాల్గొన్నారు.

వాటర్ వర్క్స్ కార్మికులకు రక్షణ పరికరాలు అందజేయాలి



కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయికులు

లక్ష్మీపురం: నగరపాలక సంస్థలోని వాటర్ వర్క్స్‌లో పని చేస్తున్న కార్మికులకు రెయిన్ కోట్స్, గ్లౌజులు, మాస్కులు వంటి రక్షణ పరికరాలు అందజేయాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్- వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ముత్యాలరావు, నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు కోరారు. సోమవారం గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలో హెడ్ వాటర్ వర్క్స్ లోను, నగరంలోని వివిధ రిజర్వాయర్లలో పని చేస్తున్న వాటర్ వర్క్స్ కార్మికులు నిరంతరాయంగా నగర ప్రజలకు మంచినీటిని సరఫరా చేసేందుకు ఈ రక్షణ పరికరాలు ఉపకరిస్తాయని, అందువల్ల రక్షణ పరికరాలు అందజేయాలని కోరారు. అలాగే ఇటీవల మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాల పెంపుదలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీఓను అమలు చేయాలని కోరారు. కమిషనర్ పులి శ్రీనివాసులు స్పందిస్తూ పెరిగిన జీతాల జీఓ అమలు అధికారులను ఆదేశించామని, అలాగే కార్మికుల రక్షణ పరికరాలు అందజేసేందుకు వెంటనే ఫైల్ పెట్టాలని అధికారులకు ఆదేశించారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

పెదకాకాని: పంట దెబ్బతిన్న రైతులకు తక్షణమే నష్టపరిహారం మంజూరు చేయాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఫిర్యాదుల దినోత్సవ కార్యక్రమంలో నష్టపరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెదకాకాని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముడియాల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ పెదకాకాని మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి పొలాలు చెరువుల్లా మారాయి. వర్షం కురిసి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటికీ నంబూరు, గోళ్ళమూడి, వెంకటకృష్ణాపురం, తంగెళ్ళమూడి, దేవరాయబొట్లవారిపాలెం గ్రామ శివార్లలో వరి పొలాలు చెరువుల మాదిరిగానే ఉన్నాయన్నారు. ఈ వర్షపునీటిలో మునిగి ఉన్న వరి పైరు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అలానే పలు గ్రామాల్లో మెట్టపైర్లు కూడా దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పంట దెబ్బతిన్న రైతులకు ఎకరానికి 10 వేల రూపాయలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.